క్లుప్తంగా

ముగిసిన క్రికెట్ పోటీలు



బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

నర్సాపూర్: పట్టణంలో వారం రోజులుగా కొనసాగిన క్రికెటర్స్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. పోటీల్లో ప్రథమ స్థానం దక్కించుకున్న చిన్నగొట్టిముక్కల క్రికెట్ టీంకు రూ.30 వేల నగదు బహుమతి, ద్వితీయ స్థానం దక్కించుకున్న పార్క్ ఎలెవన్ జట్టుకు రూ.15 వేల నగదు బహుమతిని బీఆర్ఎస్ నాయకుడు దావూద్ అందజేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులకు నగదు బహుమతులతో పాటు మెమొంటోలు అందజేశాడు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో నిర్వహించే శ్రీ మల్లికార్జున స్వామి మహోత్సవాలకు హాజరు కావాలని శనివారం మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డికి ఆహ్వానం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సొసైటీ చైర్మన్ అందె కొండల్ రెడ్డి, గ్రామ యాదవ సంఘం సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు గ్రామ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

భాషా పండితులు, పీఈటీల నిరసన



ఆందోళన చేస్తున్న దృశ్యం

వెల్దుర్తి(తూప్రాన్): పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న భాషా పండితులు, పీఈటీలు ఆందోళన చేశారు. స్కూల్ అసిస్టెంట్లతో సమానంగా బాధ్యతలు నిర్వహిస్తున్నా.. పదోన్నతుల విషయంలో ప్రభుత్వం తమను విస్మరించడం దారుణమన్నారు. దశాబ్దాలుగా వెట్టి చాకిరి చేస్తూ శ్రమ దోపిడీకి గురవుతున్న భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం పరిష్కరించాలంటూ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

సర్టిఫికెట్ల అందజేత



సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

చేగుంట(తూప్రాన్): మగ్గం వర్క్‌లో శిక్షణ పొందిన మహిళలకు శనివారం ఎంపీపీ మాసుల శ్రీనివాస్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మగ్గం వర్క్‌లో శిక్షణ పొందిన మహిళలు సొంతగా మగ్గంవర్క్ ఏర్పాటు చేసుకొని ఉపాధిని పొందవచ్చునని తెలిపారు. చేగుంట, వడియారం సెంటర్లలో 90 మంది మగ్గం వర్క్‌లో 15 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్నట్లు ఏపీఎం లక్ష్మీ నర్సమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ



బ్యాగులు పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

చిన్నశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని సూరారం ప్రాథమిక పాఠశాలలో హెల్పింగ్ సొసైటీ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఫౌండర్ సుశీల్ కుమార్, రాజు, స్వామి, సభ్యులు, పాఠశాల హెచ్ఎం శివప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగదాంబ ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న రాజశేఖర్

రామాయంపేట(మెదక్): మండలంలోని కాట్రియాల తండాలో జగదాంబ సేవాలాల్ మందిరంలో శనివారం జరిగిన పూజల్లో బీజేపీ నాయకుడు, హైకోర్టు న్యాయవాది తాళ్లపల్లి రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తండావాసులు ఆలయం అభివృద్ధికి సహకరించాలని ఆయనను విజ్ఞప్తి చేయగా, ఆలయం వద్ద షెడ్డు నిర్మాణానికి సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. తండావాసులు కంలియా, దేవీసింగ్, బాల్య, పూజారి రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి

- అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్
- ఆర్టీసీ బస్సు ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



గొల్లగూడెంలో బీసీ కమ్యునిటీ హాల్‌కు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

టేక్మాల్(మెదక్): గ్రామాల్లోని ప్రజలు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పేర్కొన్నారు. శనివారం టేక్మాల్ – పటాన్‌చెరు వరకు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సును ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుదర్శన్‌తో కలిసి ప్రారంభించారు. షాదీ ముబారక్ చెక్కును, 23 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గొల్లగూడెంలో బీసీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి, టేక్మాల్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించకుండా ఆర్టీసీ సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణించడం సురక్షితమన్నారు. ఈ కార్యక్రమంలో టేక్మాల్ సర్పంచ్ సుప్రజభాస్కర్, ఎంపీపీ చింతా స్వప్న రవి, ఎంపీటీసీ నిమ్మ వాణిరమేశ్, తహసీల్దార్ హర్దీప్‌సింగ్, పీఏసీఎస్ చైర్మన్ యశ్వంత్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు మజహర్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు భక్తుల వీరప్ప, ప్రధాన కార్యదర్శి అవినాష్, ఎంపీ వైస్ చైర్మన్ విక్రమ్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ ముక్తార్, మాజీ ఎంపీటీసీ సిద్దయ్య, సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సాయిలు, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు సలీమ్ పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి



మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్‌నాయక్

నిజాంపేట(మెదక్): సకాలంలో రుణాలు చెల్లించాలని డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో నాబార్డ్ వారి సౌజన్యంతో డీసీసీబీ బ్యాంక్ రామాయంపేట వారి ఆధ్వర్యంలో శనివారం కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ.. రైతులు స్వల్పకాలిక రుణాలు సకాలంలో చెల్లిస్తే, ప్రభుత్వం అమలు చేస్తున్న రాయితీ వర్తిస్తుందన్నారు. రుణాలు చెల్లించకుంటే వడ్డీతో పాటు అపరాధం వడ్డీ చెల్లించాల్సి వస్తుందన్నారు. రైతులకు దీర్ఘకాలిక రుణాలు ట్రాక్టర్ హార్వేస్టర్ గృహ రుణాలు, రైతు నేస్తం, బంగారు రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే బ్యాంకు ద్వారా గూగుల్ పే, ఫోన్ పే, పేటియం సౌకర్యం కలదని, రైతులందరూ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరసింహారెడ్డి, ఎంపీటీసీ బాల్‌రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ రాజు, వీఏఓ కవిత, మహేశ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



రోగులను పరిశీలిస్తున్న వైద్యులు



కిష్టాపూర్‌లో ..

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని గౌతాపూర్ గ్రామంలో మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో సర్పంచ్ స్వరూప సమక్షంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శనివారం గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో రోగులకు బీపీ, మధుమేహ పరీక్షలు నిర్వహించి, వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ తేజ మాట్లాడుతూ.. శిబిరానికి వచ్చిన రోగులకు అవసరమైన మందులు అందజేశామన్నారు. అత్యవసర చికిత్స అవసరమున్న రోగులకు ఆస్పత్రికి రావాలని చెప్పారు. వారికి వైద్యంతో పాటు, రవాణా సౌకర్యం, భోజనం ఉచితంగానే ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు సుహాస్ తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్: మండలంలోని కిష్టాపూర్‌లో హెల్ప్ ఏజ్ ఇండియా వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం శనివారం నిర్వహించినట్లు సోషల్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మహేశ్ పేర్కొన్నారు. మూడేళ్లుగా హెల్ప్ ఏజ్ ఇండియా సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో వైద్య సేవలు కొనసాగిస్తున్నమన్నారు. కిష్టాపూర్‌లో సుమారు 150 మందికి బీపీ, షుగర్ చెక్ చేసి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఫాల్, ఫార్మసిస్ట్ రమేశ్, శ్రీను, మైండ్ ట్రీ సాఫ్ట్‌వేర్ కంపెనీ వలంటీర్లు పాల్గొన్నారు.

వార్షిక పరీక్షలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఉదయ్ రంజన్‌గౌడ్

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం గ్రామ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు శనివారం వార్షిక పరీక్షలపై అసోసియేట్ ప్రొఫెసర్ ఉదయ్‌రంజన్ గౌడ్ అవగాహన కల్పించారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని, ఒత్తిడికి కాకుండా చదువుకోవాలని సూచించారు.



విజేతలతో నాయకులు

క్రికెట్ పోటీలు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని కొంతాన్‌పల్లిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చింతల మహేందర్‌రెడ్డి మూడో వర్ధంతి సందర్భంగా అతని జ్ఞాపకార్థం క్రికెట్ పోటీలు నిర్వహించినట్లు గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన యువకులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో కొంతాన్‌పల్లి జట్టు విజయం సాధించి, మొదటి బహుమతి రూ.15 వేల నగదును దక్కించుకుందన్నారు. ద్వితీయ స్థానంలో వెంకటరత్నాపూర్ గ్రామ జట్టు నిలిచి రూ.6 వేల నగదును అందుకుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, సంధ్యారాణి, శివకుమార్, కరుణాకర్‌రెడ్డి, దేవలింగం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీల నియామకంపై కలెక్టర్ స్పందించాలి



నిరాహార దీక్ష చేస్తున్న యువకులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని చిన్నఘనపూర్ గ్రామ శివారులోని మద్యం ఆధారిత నిల్వ కేంద్రం(ఐఎంఎల్)లో నిరుద్యోగ యువకులను హమాలీలుగా పనిచేసేందుకు జిల్లా కొత్త కలెక్టర్ రాజర్షిషా చొరవ చూపాలని చిన్నఘనపూర్ గ్రామ నిరుద్యోగ యువకులు కోరారు. శనివారం డిపో ఎదుట నిరాహార దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హమాలీ పని కల్పించాలంటూ నాలుగు నెలలుగా తాము డిపో ఎదుట నిరాహార దీక్షలు చేపట్టామన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రిని, సంబంధిత శాఖ కమిషనర్‌ను కలిశామన్నారు. కానీ డిపోకు చెందిన అధికారులు ఈ విషయంలో సానుకూలంగా స్పందించకపోవడం దారుణం అన్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ స్పందించి డిపోలో హమాలీ పని చేసేందుకు 50 మందికి అవకాశం కల్పించాలని కోరారు.

పశు వైద్య శిబిరం



గొర్రెలకు మందులు వేస్తున్న సిబ్బంది

తూప్రాన్: మండలంలోని జెండాపల్లిలో గొర్రెలు వింత వ్యాధితో మృత్యువాత పడుతున్న విషయంను గుర్తించిన పశువైద్య సిబ్బంది శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సుమారు 400 వందల గొర్రెలకు మందులు వేశారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సకాలంలో మందులు వేస్తే సరిపోతుందని పశువైద్యాధికారి లక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు గండి మల్లేశ్‌యాదవ్, వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేత



పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీపీ హరికృష్ణ

శివ్వంపేట(నర్సాపూర్): మెదక్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రాజర్షిషాను మర్యాదపూర్వకంగా శివ్వంపేట ఎంపీపీ కల్లూరి హరికృష్ణ శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శివ్వంపేట అభివృద్ధి కోసం సహాయసహకారాలు అందజేయాలని కోరినట్లు తెలిపారు. ఆయన వెంట సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు లావణ్యామాధవారెడ్డి, కోదండ కృష్ణగౌడ్, సర్పంచ్ బాబురావుతో పాటు తదితరులు ఉన్నారన్నారు.

గంగపుత్రులు అధిక సంఖ్యలో తరలిరావాలి

తూప్రాన్: రాష్ట్ర గంగపుత్రుల కోసం హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో గంగ పుత్ర భవన నిర్మాణానికి ఆదివారం భూమిపూజకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వస్తున్నారని జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ దేవేందర్ శనివారం పేర్కొన్నారు. ఈ భవన శంకుస్థాపనకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో గంగపుత్రులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

బల్మూరి వెంకట్‌ను వెంటనే విడుదల చేయాలి

నర్సాపూర్: ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మణిదీప్ అన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ... కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ అభ్యర్థులకు మద్దతుగా బల్మూరి వెంకట్ పోరాటం చేస్తున్నందున ప్రభుత్వం అతన్ని అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. వెంకట్‌ను క్షేమంగా వదిలిపెట్టని పక్షంలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు.

7న మండల కాంగ్రెస్ కార్యకర్త సమావేశం

కొల్చారం(నర్సాపూర్): ఈనెల 7న మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు మల్లేశంగౌడ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు చిన్నఘనపూర్ గ్రామ శివారులోని ఎల్లమ్మ గుడి వద్ద సమావేశం ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సమావేశానికి మండలంలోని కార్యకర్తలు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో కొత్త కమిటీలను నియమిస్తామన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిమ్మాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఫ్రెండ్లీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మైక్‌సెట్‌ను బహూకరించారు. కార్యక్రమంలో కార్యదర్శులు శేఖర్, రామకృష్ణారెడ్డి, ఇబ్రహీం, ఉపాధ్యాయులు ప్రభాకర్, కనకయ్య, జ్యోతి, గణేశ్, సర్పంచ్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ



టేక్మాల్(మెదక్): పూజలు చేస్తున్న భక్తులు



పెద్దశంకరంపేట(మెదక్): కోళాపల్లిలో..

టేక్మాల్(మెదక్): మండలంలోని ఎలకుర్తి గ్రామంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా గణపతి పూజ, అవాహిత దేవతా ప్రాతఃకాలపూజ, యాగశాల స్థిత ఆవాహిత మూల మంత్ర హవనములు గర్తన్యాసం, మీనా లగ్నం, యంత్ర స్థాపన, మూర్తి స్థాపన ప్రాణ ప్రతిష్ఠ, అభిషేకం, జయాది హోమం, ఇంద్రాది అష్టదిక్పాలక క్షేత్రపాలక బలిదానం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ వేడుకలకు అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ హాజరై, పూజలు చేశారు. సర్పంచ్, నిర్వాహకులు ఎమ్మెల్యేను, దాతలైనా మామిడి సుధాకర్‌రెడ్డి, నర్సింహారావు, దేశ్‌పాండెలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్వేతాచంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ మోహన్, నాయకులు సత్యాగౌడ్, మాణెయ్య, రాజయ్య, మహేందర్, రాజు, ఎంపీపీ చింతా స్వప్న రవి, టేక్మాల్ సర్పంచ్ సుప్రజా, పీఏసీఎస్ చైర్మన్ యశ్వంత్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భక్తుల వీరప్ప, ప్రధాన కార్యదర్శి అవినాష్, ఎంపీ వైస్ చైర్మన్ విక్రమ్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ ముక్తార్, నాయకులు సిద్ధయ్య, సలీమ్, గోవిందచారి, శ్రీనివాస్, గోపాల్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని కోళాపల్లిలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు ఆలయంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా శ్రీ హనుమాన్ విగ్రహంతో పాటు నవగ్రహ, శివపంచాయతన ప్రతిష్ఠ , ధ్వజస్తంభ ఏర్పాటు చేశారు. దీంతో పాటు తొగుట ఆశ్రమ పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతీస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి, భక్తులకు ప్రవచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత విగ్రాం వేణుగోపాల్‌గౌడ్, సర్పంచ్ లక్ష్మీనర్సింలు, నాయకులు గణేశ్, సుభాశ్‌గౌడ్, రోమాల మాణిక్యం, మొగులయ్య, ఈశ్వర్‌సింగ్, జగన్, శంకరయ్య, ప్రభాకర్, రాజు, చంద్రకాంత్, సాయిలుతో పాటు అర్చకులు గుడి చంద్రశేఖర్‌శర్మ, ప్రవీణ్‌శర్మ, సంతోశ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాలకు న్యాయం చేసేలా కేంద్ర బడ్జెట్

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయపల్లి గోపి



మాట్లాడుతున్న సింగాయపల్లి గోపి

నర్సాపూర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ చాలా బాగుందని, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయపల్లి గోపి చెప్పారు. శనివారం ఆయన పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్ మాదిరిగానే అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసేలా రాష్ట్ర బడ్జెట్ ఉండాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. కాగా మున్సిపాలిటీలోని బీఆర్ఎస్ కౌన్సిలర్లు బీజేపీలో చేరేందుకు సిద్ధగా ఉన్నారని త్వరలో బీజేపీ భారీ బహిరంగ సభను ఏర్పాటుచేసి పెద్ద ఎత్తున చేరికల కార్యక్రమం చేపడుతామని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మల్లేశ్‌గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, పార్టీ నాయకులు సురేశ్, బాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాస్, రవిగౌడ్, ఆంజనేయులుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పరిమితి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకోవద్దు



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట(మెదక్): పరిమితి మించి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకోవద్దని ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్ఐ ఆధ్వర్యంలో శనివారం ఆటో డ్రైవర్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ ద్వారా డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు పరిమితి మించి ఆటోలో స్కూల్ పిల్లలను ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. ఆటో నడిపేవారు తప్పకుండా లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ కలిగి ఉండాలని చెప్పారు. ఎప్పుడైనా అనుకోకుండా ప్రమాదాలకు గురైతే ఇన్సూరెన్స్ అందుబాటులో ఉంటుందని తప్పకుండా వాహనాలు నడిపించే ప్రతీ ఒక్కరూ ధ్రువపత్రాలు కలిగి ఉండాలని ఆటో డ్రైవర్లకు సూచించారు. ఆటో డ్రైవర్లు వాహనాల ఇన్స్‌రెన్స్ విషయంలో సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐలు ప్రతాప్, లక్ష్మి, పోలీస్ సిబ్బంది సునీత, సాయిబాబా, విజయ్, నవీన్, ఆటో డ్రైవర్లు జాల పోచయ్య, స్వామి, రాజు, బాబుమియా, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



అన్నప్రాసన చేస్తున్న సర్పంచ్ మనోహర

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిన్నారులకు తల్లిపాలతో పాటు, అనుబంధ పోషక ఆహారం అందించడంతో ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ మనోహర అన్నారు. శనివారం మండల పరిధిలోని ఫైజాబాద్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో నిర్వహించిన అన్నప్రాసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మనోహర హాజరై, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. అనంతరం ఆమె అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరునెలల వయసు వచ్చే వరకు చిన్నారులకు తల్లి పాలు పట్టించాలని, ఆరు నెలల తర్వాత తల్లి పాలతో పాటు, అనుబంధ ఆహారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శశికళ, మహిళలు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ పత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐ, ప్రతినిధులు

రామాయంపేట(మెదక్): పదో తరగతి విద్యార్థుల కోసం ఎస్ఎఫ్ఐ తయారు చేసిన టాలెంట్ టెస్ట్‌కు సంబంధించి కరపత్రాలను శనివారం సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, సంఘం ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా బాధ్యులు జగన్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఈ టాలెంట్ పత్రాలు ఎంతగానో ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. ఫిబ్రవరి పదిన జిల్లా వ్యాప్తంగా టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తామని, ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ ఆలయ వార్షికోత్సవం



ప్రేమ్‌సింగ్ మహారాజ్‌ను సన్మానిస్తున్న సర్పంచ్

రామాయంపేట(మెదక్): నార్సింగి మండల పరిధిలోని నర్సంపల్లి పెద్దతండాలోని జగదాంబ సేవాలాల్ మందిరం వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు యజ్ఞం, అన్నదానం నిర్వహించారు. దీక్ష గురువు ప్రేమ్‌సింగ్ మహారాజ్ పూజల్లో హాజరై, తండావాసులతో కలిసి జాగరణ చేశారు. ఈ సందర్భంగా తండావాసులు ప్రేంసింగ్ మహారాజ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నార్సింగి ఎంపీపీ చిందం సబిత, జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, తండా సర్పంచ్ చత్రియా నాయక్, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు లింగారెడ్డి, నర్సంపల్లి గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు బాషానాయక్, సహకార సంఘం డైరెక్టర్ బిక్యానాయక్, బీఆర్ఎస్ నార్సింగి పట్టణ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు నర్సింలు, టెలికాం బోర్డు మాజీ సభ్యుడు అంచనూరి రాజేశ్, తండా పెద్దలు సోమ్లానాయక్, తొర్యానాయక్, మంగ్యానాయక్, పూజారి శంకర్ నాయక్, వల్లూర్ సర్పంచ్ మహేశ్వరి, నర్సంపల్లి మాజీ ఎంపీటీసీ సత్యం, తదితరులు పాల్గొన్నారు.